క్లుప్తంగా

గణనాథుడికి తలారి పూజలు



ఉత్సవ కమిటీ సభ్యులతో తలారి వెంకట్రావు తదితరులు

తాళ్లపూడి(కొవ్వూరు): మండలంలోని నందమూరు గ్రామంలోని ఏర్పాటు చేసిన వినాయక చవితి ప్రత్యేక పూజలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శనివారం పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులకు అన్నవితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్, నాయకులు మారిన రామకృష్ణ, గ్రామానికి చెందిన నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా స్మార్ట్ కార్డుల పంపిణీ

తాళ్లపూడి: రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలని ఉద్యోగులతో పాటు రేషన్ డీలర్లు సహకారం అందించాలని తహసీల్దార్ లక్ష్మీ లావణ్య కోరారు. తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం మండలంలోని రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 16,674 స్మార్ట్ కార్డులు మంజూరు కాగా 11,671 కార్డులు పంపిణీ చేశారన్నారు. మిగిలిన 30 శాతం కార్డులు త్వరలో పంపిణీ పూర్తి చేస్తామన్నారు. స్మార్ట్ కార్డులు పంపిణీ జరగకపోవటానికి, రేషన్ పంపిణీకి సంబంధం లేదని, ప్రజలు ఎవ్వరూ ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఈ సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు నానో యూరియానే వాడాలి

దేవరపల్లి: ఖరీఫ్ వరిచేలకు మామూలు యూరియాకు బదులు నానో యూరియా వాడాలని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ రైతులకు సూచించారు. నానో యూరియా, జీవన ఎరువుల వాడకం వల్ల కలిగే లాభాలపై మండలంలోని గౌరీపట్నం సొసైటీ వద్ద రైతులు, సొసైటీ, ప్రైవేటు ఎరువుల దుకాణాల యజమానులకు శనివారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. మామూలు యూరియాలో 30 నుచి 40 శాతం మాత్రమే మొక్క తీసుకుంటుందని మిగిలిన ఎరువు వాయురూపంలోకి ఆవిరవుతుందని, నానో యూరియా 80 నుంచి 85 శాతం మొక్క శరీరంలో శోషించబడుతుందని ఆయన వివరించారు. 500 మిల్లీ లీటర్ల నానో యూరియా బాటిల్, 45 కిలోల బస్తా సాధారణ యూరియాతో సమానంగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు, ఎరువుల దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

పోషకాలు-తెగుళ్లపై అవగాహన

నల్లజర్ల: ఉద్యానతోటల్లో మొక్కలకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాలను అజిటోబక్టర్, ఫాస్పరస్ సాల్యుబిలైజింగ్ బ్యాక్టీరియా, పొటాష్ రిలీజింగ్ బ్యాక్టీరియా వినియోగించి సేంద్రియ పద్ధతిలో ఉద్యానసాగు చేపట్టవచ్చునని డాక్టర్ వైఎస్సార్ విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త (తెగుళ్ల విభాగం) డాక్టర్ శేషకిరణ్ రైతులకు సూచించారు. నల్లజర్ల ఉద్యాన అధికారి యం.బబిత అధ్యక్షతన శనివారం నల్లజర్ల రైతు సేవా కార్యక్రమంలో ఉద్యాన తోటల పోషకాలు-తెగుళ్ల యాజమాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన పరిశోధన స్థానం ఉత్పత్తి చేస్తున్న కూరగాయల పంటల్లో అంట్లు కట్టడం ద్వారా ఎక్కువ కాలం కూరగాయల మొక్కల నుంచి ఉత్పత్తి చేయవచ్చునని వివరించారు.

వైభవంగా అనంతపద్మనాభ స్వామి వ్రతం

నల్లజర్ల: దూబచర్లలోని దత్తసాయి పంచావతార మహాపీఠంలో శనివారం అనంత పద్మనాభ స్వామి వ్రతం వైభవంగా నిర్వహించారు. గత 18 సంవత్సరాలుగా ఈ వ్రతాలను ఆచరిస్తున్నట్టు భక్తులు తెలిపారు. జగద్గురు దత్తాత్రేయస్వామి కలియుగ పంచదత్తవతారాలు, ఉన్న ఈక్షేత్రం దినదినాభివృద్ధి చెందుతోంది. శుక్ర, శనివారాలలో ద్వారకా తిరుమల వెళ్లే పాదచారులకు అల్పాహారం అందిస్తూ ప్రతి కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు భక్తి, శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

కోలాహలంగా గణేశ్ నిమజ్జనం



దేవరపల్లిలో నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగుతున్న గణనాథుడు



అన్నవరప్పాడులో పూలవాహనంపై ఊరేగుతున్న గణనాథుడు



తాళ్లపూడిలో ఉత్సవ కమిటీ సభ్యుల సందడి

- వైభవంగా గణేశుడి శోభాయాత్ర
- సందడిగా మారిన గ్రామాలు

దేవరపల్లి: గ్రామ గ్రామాన నిజమజ్జనాల కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించి బొజ్జ గణపయ్యకు వీడ్కోలు పలికారు. దాదాపు తొమ్మిది రోజులు మండపాల్లో కొలువైన గనణాథులు గంగమ్మ చెంతకు చేరడంతో నిమజ్జనం అనంతరం భక్తులు మండపాలకు చేరుకుని దిగాలుగా కనిపించారు. విద్యుత్ దీపకాంతులలో మిరిమిట్లు గొలిపిన మండపాలు బోసిపోయాయి. మండపాలను తొలగించడంతో గ్రామాలు మూగబోయాయి. చివరి రోజు దేవరపల్లి మండలంలో గణేశ్ నిమజనాలు జోరుగా జరిగాయి. ఈ ఏడాది చవితి సందర్భంగా దాదాపు 120 విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తులు పూజలు చేశారు. ఆదివారం చంద్రగ్రహణం కావడంతో పండితుల సూచనల మేరకు ఐదు రోజుల పూజల అనంతరం స్వామి వారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. దేవరపల్లి మెరవీధి వినాయకుడి ఆలయం వద్ద, గోపాలపురం రోడ్డు, శ్రీవిఘ్నేశ్వర లారీ ఓనర్స్, వర్కర్స్ యూనియన్ వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలను నందివాహనం, ప్రత్యేకంగా అలంకరణ చేసిన లారీపై వైభవంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. నిమజ్జనా ప్రదేశాలు, ఊరేగింపుల్లో గట్టి పోలీస్ భద్రత ఏర్పాట్లు చేశారు. నిమజ్జనం సందర్భంగా పలు గ్రామాల్లో అన్నసమారాధన నిర్వహించారు.

సందడిగా వినాయక నిమజ్జనాలు

తాళ్లపూడి: మండల వ్యాప్తంగా గ్రామాల్లో వినాయక చవితి ముగింపు వేడుకలు సందడిగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉత్సవ కమిటీ సభ్యులు, యూత్ కోలాహలంగా పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేశారు. తీన్‌మార్ నృత్యాలు, డీజేలతో ఊరేగించారు. తాళ్లపూడి, వేగేశ్వరపురం, అన్నదేవరపేట, ప్రక్కిలంక, పెద్దేవంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను ట్రాక్టర్‌పై ఊరేగించి గోదావరిలో నిమజ్జనం చేశారు.

అన్నసమారాధన..

వేగేశ్వరపురంలోని కాలువ గట్టు వినాయకుడి ఆలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో శనివారం వినాయక చవితి ముగింపు సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సుమారు 4 వేల మంది భక్తులు ఈ అన్నసమారాధనలో పాల్గొన్నారు.

ఉత్రూతలూగించిన నిమజ్జనాలు

పెరవలి: గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా శనివారం అన్నవరప్పాడులోని వినాయక ఊరేగింపులు ఊత్రూతలు ఊగించాయి. గ్రామంలో ఎన్నడూ లేనివిధంగా వివిధ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనాలు అన్ని ఒక్కసారి జరగటంతో పరిసర ప్రాంతాలు సందడిగా ప్రజలతో కిక్కిరిసిపోయాయి.

సాంస్కృతిక కార్యక్రమాలు

గోపాలపురం: గణపతి నవరాత్రలలో భాగంగా ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జనం కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వరీ టౌన్ షిప్‌లో నూతనంగా నిర్మించిన లక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడిని గ్రామంలో అంగరంగ వైభవంగా ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. గోపాలపురం లక్ష్మీ దుర్గా టాకీస్ స్టాండ్ వద్ద శనివారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని గుడ్డిగూడెం, జగన్నాధపురం, రేగులకుంట, నందిగూడెం, కరగపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

పశ్చిమడెల్టాలో 28 విగ్రహాల నిమజ్జనం

నిడదవోలు: తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ చెంతకు చేరాడు. పట్టణంలో ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శనివారం 28 వినాయక విగ్రహాలను పశ్చిమడెల్టా ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు. పట్టణంలో గణేష్‌చౌక్ సెంటర్‌లో వేంచేసియున్న పూజా గణపతి, కుమారస్వామి వార్ల ఆలయం వద్ద ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఆధ్వర్యంలో 103వ వార్షికోత్సవ వేడుకలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఆలయం వద్ద రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక పూజలు చేసి భారీ వినాయక ఊరేగింపును ప్రారంభించారు. హంస వాహనంపై 18 అడుగుల భారీ విగ్రహన్ని ఉంచి ఊరేగింపును కన్నులపండుగగా నిర్వహించారు. పోలీసుల బందోబస్తుతో వాయిద్యాలు, సన్నాయి తాళాలు, బట్టబొమ్మలు, రాక్షసవధ, ప్రత్యేక బ్యాండ్ మేళాలతో ఊరేగింపు సాగింది.భారీ విగ్రహం నిమజ్జనానికి సంబంధించి ఏర్పాట్లు చేయకపోవడంతో అర్ధరాత్రి వరకు నిమజ్జనం నిలిచిపోయింది. దీంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. నిమజ్జనం నిలిచిపోవడంతో పట్టణానికి అరిష్టమని ఉత్సవ కమిటీ ఆందోళన చెందుతుంది. సీఐ పీవీజీ తిలక్, పట్టణ ఎస్సై జగన్ మోహన్‌రావు పర్యవేక్షణలో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు.

భక్తి శ్రద్ధలతో..

నిడదవోలు రూరల్: గణనాథుడి నిమజ్జనం ముగింపు వేడుకలను నిడదవోలు రూరల్, ఉండ్రాజవరం మండలాల్లోని సమిశ్రగూడెం, కోరుమామిడి, వేలివెన్ను గ్రామాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. సమిశ్రగూడెంలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడిని బాల గణేష్ యూత్ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూలతో అలంకరించి వాహనంలో ఊరేగించారు. ఉత్సవ విగ్రహాలను నిమజ్జనం చేశారు. వేలివెన్నులో ప్రసిద్ధిచెందిన గాంధీబొమ్మ సెంటర్‌లోని కొలువైన శ్రీలక్ష్మీ గణపతిస్వామిని రూ.11 లక్షలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగించారు. కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన డప్పు విన్యాసాలు, తీన్‌మార్, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి.



లక్ష్మీ గణపతి ఆలయం వద్ద హారతులు ఇస్తున్న మహిళలు



ఊరేగింపును ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్



సమిశ్రగూడెంలో గణనాథుడిని దర్శించుకుంటున్న బాల గణేష్ యూత్ సభ్యులు

అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు



ఎంపీ మిథున్ రెడ్డితో తలారి వెంకట్రావు

చాగల్లు: లిక్కర్ కేసులో మధ్యంతర బెయిల్‌పై రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలైన ఎంపీ మిథున్ రెడ్డిని, కొవ్వూరు నియోజవర్గ మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు శనివారం కలిశారు. ఈ సందర్భంగా బెయిల్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం తలారి మాట్లాడుతూ మిథున్‌రెడ్డిని అక్రమంగా లిక్కర్ కేసులో అరెస్టు చేశారని, కూటమి ప్రభుత్వం అరాచకాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే తప్పకుండా బుద్ధి చెబుతారని మండిపడ్డారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం

నల్లజర్ల: డ్వాక్రా సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్)ఎంతగానో ఉపయోగపడుతుందని ఐకేపీ ఏపీఎం శ్యాంసుందర్ అన్నారు. మండల మహిళా సమాఖ్య భవనంలో శుక్రవారం ఉల్లాస్ రెండవ బ్యాచ్‌కు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో ఉన్న మహిళలు ఎక్కువ శాతం నిరక్షరాస్యులుగా ఉన్నారని, ఈ కారణంగా వారి పిల్లలకు విద్యపై సరైన అవగాహన కల్పించకపోవడంతో, భవిష్యత్తుకు సంబంధించి బాటలు వేయడంలో తడబడుతున్నారని తద్వారా పిల్లలు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. పదిమంది నిరక్షరాస్యులకు ఒక వలంటీర్‌ను నియమించి ఉల్లాస్ కార్యక్రమం ద్వారా విద్యావంతులుగా తీర్చిదిద్దుతామన్నారు. హాజరైన సభ్యులతో అక్షరాంధ్ర సంపూర్ణ అక్షరాస్యత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఇఓ-1 సత్యనారాయణ, ఎంఇఓ-2 భగవతీదేవి, సీసీలు మాలినీ, రాధా మురళీకృష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అసత్యాలే పెట్టుబడిగా చంద్రబాబు పాలన



ప్రజలకు కూటమి మోసాలను వివరిస్తున్న తలారి వెంకట్రావు

చాగల్లు: అసత్యాలే పెట్టుబడిగా పరిపాలన సాగిస్తున్న ఏకైక వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే ఈ దేశంలో అది చంద్రబాబు ఒక్కరేనని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు విమర్శించారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని గౌరుపల్లి గ్రామంలో జరిగిన సభలో కూటమి మోసాలను గ్రామస్థులకు వివరించారు. అబద్ధాలు, మోసాలతో చంద్రబాబు సర్కారు ప్రజలను చేస్తున్న నయవంచనను కళ్లకు కట్టినట్లు నాయకులు వివరించారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సీఎంగా జగనన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికల హామీలేవీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని, ఇచ్చిన ఒకట్రెండు పథకాలు కూడా అరకొరగా అమలు చేశారని దుయ్యబట్టారు. అధికారం కోసం కూటమిగా ఏర్పడి అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారని, తీరా అధికారంలోకి వచ్చాక ఓట్లేసిన జనాన్ని, వారి కిచ్చిన హామీల అమలును నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి పరిమి సోమరాజు, మాజీ ఎంపీటీసీ చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, నాయకులు తాళ్లూరి సత్యనారాయణ, ఎస్.ముప్పవరం సర్పంచ్ ముప్పిడి మహాలక్ష్మడు, కిషోర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందించలేని దుస్థితిలో ప్రభుత్వం



అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

తాళ్లపూడి(కొవ్వూరు): రైతులకు కనీసం ఎరువులు అందజేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటని, రైతన్నలకు బాసటగా వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు రైతన్నలకు భరోసానిచ్చారు. కొవ్వూరు పార్టీ కార్యాలయంలో శనివారం రైతులకు యూరియా, ఎరువులు కొరతపై పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 9న నిర్వహించే ఎరువులు బ్లాక్ మార్కెట్ పై అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్‌ను తలారి వెంకట్రావు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ ఎరువులు పక్కదారిపట్టి బ్లాక్‌మార్కెట్‌కు చేరుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం రైతులకు ఎరువులు అందజేయడంలో పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. అందుకు నిరసనగా రైతులకు బాసటగా కొవ్వూరులో 9న నిర్వహించే 'అన్నదాత పోరు' కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రైతులు, నాయకులు పాల్గొని రైతన్నలకు బాసటగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివ రామకృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్‌కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, పార్టీ పట్టణ కన్వీనర్ చిట్టూరి అన్నవరం, మండల కన్వీనర్ వెంపాటి సురేష్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పరిమి సోమరాజు, ఎంపీపీ మట్టా వీరస్వామి, ముఖ్య నాయకులు తోట రామకృష్ణ, కొమ్మిరెడ్డి పరశురామారావు, ఉప్పులూరి సూరిబాబు, సుంకర సత్యనారాయణ, నామా ప్రకాశం, ఏలూరి విజయలక్ష్మి, తానేటి కుమారి, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం



పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్లు

దేవరపల్లి: దేవరపల్లిలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం శనివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. మండలంలోని యర్నగూడెం మహిళా మండలి సభ్యులచే కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఇప్పటి వరకు 41 ప్రాంతాల్లో వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం జరిపించినట్టు సభ్యులు తెలిపారు. 42వ కల్యాణం దేవరపల్లిలో యాగంటి సత్యన్నారాయణ కుమారుడు శ్రీనివాస్, లక్ష్మీ పద్మావతి దంపతులు ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారన్నారు. పద్మావతి అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను, స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరణ చేసి భక్తులు కల్యాణ వేదికపైకి తోడ్కొని వచ్చారు. అనంతరం వేదపండితుల వేదమంత్రాలు, గోవింద నామస్మరణలతో కల్యాణ తంతు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని కనులారా వీక్షించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సర్వేల నుంచి ఉద్యోగులను మినహాయించాలి

నిడదవోలు: క్లస్టర్ మ్యాపింగ్, మన మిత్ర డోర్ టూ డోర్ సర్వే నుంచి సచివాలయ ఉద్యోగులను మినహాయించాలని డిమాండ్ చేస్తూ నిడదవోలు మున్సిపల్ కార్యాలయం వద్ద పట్టణ సచివాలయ ఉద్యోగులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు పట్టణ పరిధిలో ఉన్న 13 వార్డు సచివాలయాల ఉద్యోగులు విధులు బహిష్కరించి మున్సిపల్ మేనేజర్ బి.శారదదేవికి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దిగజారుస్తూ వాట్సప్ సర్వీస్‌పై ప్రతి ఇంటికి వెళ్లి బలవంతంగా వివరాలు నమోదు చేయలని ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం స్పందించికపోతే తమ పోరాటం ఉద్ధృతం చేస్తామని సచివాలయ ఉద్యోగులు హెచ్చరించారు.

ఉపాధ్యాయులకు సత్కారం

గోపాలపురం: విద్యార్థుల ఉన్నతికి ఎల్లప్పుడూ కష్టపడి పనిచేసే ఉపాధ్యాయులను సత్కరిచండం అభినందనీయమని గోపాలపురం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక శర్వాణి హైస్కూల్‌లో శనివారం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఏడుగురు ఉపాధ్యాయులను సత్కరించారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో

తాళ్లపూడి: మండల ఏపీటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పైడిమెట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సన్మాన కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు శంకరం, శ్రీనివాస్, పురిఘళ్ల రఘువీర శాస్త్రి, కృష్ణ మోహన్‌ను ఘనంగా సత్కరించారు.

భారీ గణపయ్యకు నిమజ్జనం లేనట్టేనా..?

నిడదవోలు: పట్టణంలోని గణేష్‌చౌక్ సెంటర్‌లో ఉన్న పూజ గణపతి, కుమారస్వామివార్ల ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 18 అడుగుల భారీ వినాయక విగ్రహం నిమజ్జనం వివాదాస్పదంగా మారింది. శనివారం ఉదయం మంత్రి దుర్గేష్ ఈ విగ్రహ ఊరేగింపును ప్రారంభించారు. సాయంత్రం నిమజ్జనానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. 30 ఏళ్లగా ఓవర్ బ్రిడ్జి పైనుంచి భారీ క్రేన్ల సాయంతో పశ్చిమ బెల్ట్ ప్రధాన కాల్వలో నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది పోలీసులు ఓవర్ బ్రిడ్జి పైనుంచి విగ్రహాన్ని దింపడానికి అనుమతి నిరాకరించారు. బ్రిడ్జి కింద నుంచి విగ్రహాన్ని తీసుకెళ్లాలని ఎస్సై జగన్‌మోహన్‌రావు పట్టుబట్టడంతో వివాదం చోటుచేసుకుంది. భారీ విగ్రహానికి రెండు చెట్లు అడ్డురావడంతో విగ్రహాన్ని నిమజ్జనం చేయకుండా పోలీసులు చేతులెత్తేశారు. ఆలయ కమిటీ సభ్యులు మళ్లీ ఎస్సైను సంప్రదించి, బ్రిడ్జి పైనుంచి విగ్రహాన్ని దించుతామని అడిగినా అందుకు అనుమతించలేదు. కాగా పట్టణంలో జనసేన పార్టీకి చెందిన వారి విగ్రహాన్ని బ్రిడ్జి పైనుంచి దించడానికి అనుమతించడం వివాదాస్పదమైంది.

స్టడీ మెటీరియల్ బహూకరణ

గోపాలపురం: జవహార్ నవోదయ విద్యాలయంలో విద్యార్థులు ప్రతిభ కనబరచాలని గోపాలపురం తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్‌వోగా పనిచేస్తున్న జోడాల వెంకటేశ్వరరావు శనివారం పెద్దాపురం పాఠశాల విద్యార్థులకు నవోదయ స్టడీ మెటీరియల్ పుస్తకాలను 10 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయ స్టడీ మెటీరియల్ ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్న ఉద్దేశంతోనే పుస్తకాలను అందజేసినట్లు వివరించారు.

పాఠశాల హెచ్‌ఎం జి.రత్నమణి మాట్లాడుతూ రూ.4వేల విలువైన నవోదయ స్టడీ మెటీరియల్‌ను అందించిన జోడాల వెంకటేశ్వరరావు అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో మండల మానవత మాజీ అధ్యక్షుడు ముప్పన కృపావరప్రసాద్‌రెడ్డి, సీఆర్పీ కొయ్య నాగరాజు,పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.